జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 9-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 639 పేజీలు: 4 వెల : రూ.7

## శ్రీకాకుళం నుంచి తిరుపతికి..
# రైలు సర్వీసు


* కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
* ఈనెల 13 నుండి ప్రారంభం
* ఫలించిన రామ్మోహన్ నాయుడు చొరవ
* మరిన్ని సర్వీసులు తీసుకొస్తానని హామీ







శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త): కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు నిరంతర కృషి ఫలితంగా శ్రీకాకుళం నుండి తిరుపతికి మొట్టమొదటి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీసు మంజూరైంది. దీనికి సంబంధించి రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేస్తూ 17439/40 తిరుపతి - శ్రీకాకుళం రోడ్ హమ్సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 13నుండి ప్రారంభించనుంది. ఈ రైలు ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి నుండి, ప్రతి సోమవారం మధ్యాహ్నం శ్రీకాకుళం రోడ్ నుండి ప్రయాణిస్తుంది. ఇప్పటివరకు శ్రీకాకుళం జిల్లా ప్రజలు.. భువనేశ్వర్ నుండి ప్రారంభమయ్యే రైలు సర్వీసుల పై ఆధారపడేవారు. మరోవైపు విశాఖపట్నం మీదుగా తిరుమల దర్శనం కోసం ప్రయాణించి రద్దీ, ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అయితే ఈ కొత్త సర్వీసుతో భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణం, ఎక్కువ బెర్త్‌లు అందుబాటులోకి వస్తాయనీ రామ్మోహన్ నాయుడు తెలిపారు. తాను ఎంపీగా ఉన్నప్పటి నుండి ఈ లక్ష్యాన్ని పెట్టుకుని రైల్వే మంత్రులు, రైల్వే బోర్డు, ఇ=వీ, జోనల్ మీటింగ్‌లలో నిరంతరం ప్రయత్నాలు చేసినట్టు తెలిపారు. ఈ నూతన సర్వీసును ఏప్రిల్ 13న శ్రీకాకుళం రోడ్ స్టేషన్ నుండి ప్రారంభించబోతున్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు శ్రీకాకుళం జిల్లా ప్రజల తరపున రామ్మోహన్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో శ్రీకాకుళం నుండి మరిన్ని నూతన రైలు సర్వీసులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానని, జిల్లా రైల్వే ప్రగతిని ముందుకు తీసుకెళ్తానని మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.




## మూలపేట పోర్టు పేరుతో..

* రైతుల భూములతో ఆడుకుంటే సహించేది లేదు
* రాజధానిగా 'మావిగన్' మాత్రమే ఆచరణ సాధ్యం
* అమరావతి ఒక అంతులేని దోపిడీ
* మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

# బాబాయ్ అబ్బాయ్‌ల దోపిడీ

శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త): మూలపేట పోర్టుకు వైఎస్ జగన్మోహనరెడ్డి అన్ని అనుమతులతో 70 శాతం పనులు పూర్తి చేస్తే, ఇప్పుడు 'బాబాయ్-అబ్బాయిలు' మరో 15 వేల ఎకరాల భూసేకరణ పేరుతో కొత్త దోపిడీకి తెరలేపారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా ఉద్యమాల పురిటిగడ్డ అని, రైతుల భూములతో ఆడుకుంటే సహించేది లేదన్నారు. బుధవారం శ్రీకాకుళంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అమరావతి ముసుగులో జరుగుతున్న ఈ దోచుకో-పంచుకో-తినుకో విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను సీఎం చంద్రబాబు భ్రమల్లో ముంచుతున్నారని, అమరావతి పేరుతో చంద్రబాబు అంతులేని దోపిడీకి పాల్పడుతున్నారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ధ్వజమెత్తారు. చంద్రబాబు అవలంబిస్తున్న విధానాలు కేవలం దోపిడీ కోసమే తప్ప రాష్ట్రాభివృద్ధి కోసం కాదని విమర్శించారు 2014లో 50 వేల ఎకరాలు చాలని చెప్పిన బాబు, ఇప్పుడు లక్ష ఎకరాలు కావాలని అడగడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, లక్ష ఎకరాల్లో మౌలిక సదుపాయాల కోసమే రూ.2 లక్షల కోట్లు ఖర్చవుతాయన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇది ఇప్పట్లో పూర్తయ్యే పని కాదన్నారు. దేశ రాజధాని ఢిల్లీ 10,500 ఎకరాల్లో విస్తరించి ఉంటే, అక్కడ చదరపు అడుగుకు రూ.4వేలు ఖర్చు చేశారన్నారు. అమరావతిలో చదరపు అడుగుకు రూ.14 వేలు ఎందుకు ఖర్చు చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణ సచివాలయం 28 ఎకరాలలో 10 లక్షల ఎస్ఎఫ్‌టీ 615 కోట్లు ఖర్చు చేస్తే దేశ పార్లమెంట్ 970 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఆ భవనాలు కంటే అమరావతి అసెంబ్లీ భవనానికి 1449 కోట్లు భవనాల అంచనాలు భారీగా పెంచి చూపడం ఎవరి జేబులు నింపడానికని ప్రశ్నించారు. 2014-19 పోలవరం ప్రాజెక్టును ఏటీఎం కార్డులా వాడుకున్నారని ఇప్పుడు అమరావతిని ఏటిఎంలా వాడుతున్నారని ఎద్దేవ చేశారు. కేవలం గత ఏడేళ్లలో అమరావతి నిర్మాణానికి రూ. 8 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఈ లెక్కన రాజధాని పూర్తి కావడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. కేవలం ఈ 22 నెలల్లో 3లక్షల55 వేల కోట్లు అప్పు చేశారని ఈ పరిస్థితుల్లో రెండు లక్షల కోట్లతో రాజధాని నిర్మాణం ఆచరణ సాధ్యమా అని ఈ రెండు లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారో ప్రజలకు తెలియజేయాలని ఆయన నిలదీశారు ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన 'ప్లాన్-బి' (మావిగన్ - మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కారిడార్) ప్రాముఖ్యతను ఆయన వివరించారు. 110 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పటికే మచిలీపట్నం పోర్టు, గన్నవరం అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్, విజయవాడ గుంటూరు రైల్వే జంక్షన్లు, కృష్ణానది అటు పోలవరం కుడి కాలువ ద్వారా పుష్కలమైన నీటి వనరులు, ఎన్ టి టి పి ఎస్ థర్మల్‌తో పాటు పోలవరంలో 960 మెగావాట్ల జల విద్యుత్ కావలసినంత ఇశీదన వనరులు ఉన్నాయని అమరావతికి పెట్టే ఖర్చులో కేవలం 10 శాతం ఇక్కడ పెడితే ఇది ప్రపంచస్థాయి నగరంగా మారుతుందని తెలిపారు. పోర్టు అనుసంధానంగా ఉన్న వేగంగా అభివృద్ధి చెందిన చెన్నై ముంబై నగరాలు సరసన మావిగన్ చేరుతుందన్నారు. హైదరాబాద్ చెన్నై బెంగళూరు వంటి నగరాలతో వేగంగా పోటీపడి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా మావిగన్ నమూనాలో నాలుగు కార్పొరేషన్లు రెండు మున్సిపాలిటీలు ఉండడమే కాకుండా 60 లక్షల పైగా జనాభా ఉండడం వలన ఈ ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. శివరామకృష్ణ కమిటీ సూచనల మేరకు వికేంద్రీకరణే సరైనదని, అందుకే జగన్.. మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని.. కానీ బాబు అండ్ కో విషప్రచారంతో దానిని అడ్డుకున్నారని మండిపడ్డారు. అమరావతి నిర్మాణంలో ఎక్కడా లేని విధంగా చదరపు అడుగుకి 14 వేలు ఖర్చు చేస్తున్నారు అదే విధంగా దేశంలో ఆరు లైన్ల జాతీయ రహదారి కిలోమీటర్‌కు 20 కోట్లు చొప్పున నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మిస్తుంటే అమరావతిలో కిలోమీటర్‌కి 53 కోట్లు చొప్పున ఖర్చు చేస్తున్నారని అదేవిధంగా రాజధానిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ లో సచివాలయం టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాల డిజైన్లకు 401 కోటి ఖర్చు చేశారని దేశంలో ఎక్కడైనా డిజైన్లకు ఇంత ఖర్చు చేసిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. మావిగన్ ప్రజల్లో మంచి స్పందన రావడంతో దానిని డైవర్ట్ చేయడం కోసం ఏబీఎన్ రాధాకృష్ణ వైయస్సార్ పార్టీ నాయకులపై మహిళలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం బాధాకరంగా ఉన్నాయన్నారు. ఇది ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం అని తమ్మినేని సీతారాం అన్నారు. చివరగా ఉత్తరాంధ్రలో జరుగుతున్న భూ కుంభకోణాలపై కూడా తమ్మినేని తీవ్రంగా స్పందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దుంపల లక్ష్మణరావు, రణస్థలం ఎంపీపీ పిన్నింటి సాయి కుమార్, శ్రీకాకుళం ఎంపీపీ అంబటి శ్రీను, రాష్ట్ర ఇంటలెక్చువల్ కార్యదర్శి పిల్లల రామకృష్ణ, ఎచ్చర్ల జడ్పీటీసీ సనపల నారాయణరావు, కొత్తూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సీనియర్ న్యాయవాది సింగుపురం మోహనరావు, ఆమదాలవలస మాజీ జడ్పీటీసీ బొడ్డేపల్లి నారాయణరావు, జిల్లా వైఎస్ఆర్ పార్టీ యువత అధ్యక్షులు మార్పు పృథ్వి, ద్వారపు అజిత్, సీపాన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.





## నేడు జిల్లాలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి సుభాష్ పర్యటన

శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త): రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ నెల 9వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. 9వ తేదీన ఉదయం 8 గంటలకు విశాఖపట్నం నుంచి రోడ్డు మార్గాన శ్రీకాకుళం చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు ఎచ్చెర్ల శాసన సభ్యులు నడికుదిటి ఈశ్వరరావు ఇచ్చే అల్పాహార విందులో పాల్గొంటారు. అనంతరం 10.30 గంటలకు ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎన్ఎసిఎల్ ఫ్యాక్టరీలో జరగబోవు సేఫ్టీ సెలబ్రేషన్స్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు రెడ్డీస్ లేబరేటరీలో జరగబోవు మాక్ డ్రిల్ ను సందర్శింస్తారు మధ్యాహ్నం 1 గంటలకు కార్మికులతో ఆయన భోజనం చేస్తారు. సాయంత్రం 3 గంటలకు అక్కడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు.

## ఆదర్శం.. ప్రభావతి
# అవయవ దానం

* ఆర్గాన్స్ డొనేట్‌కు ముందుకు వచ్చిన కుటుంబీకులు
* చిన్నబరంపురంలో అంత్యక్రియలు




4లో

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

# శ్రీకాకుళం

## మాజీ కౌన్సిలర్ నరసింహా మూర్తి కన్నుమూత



ఇచ్ఛాపురం ఏప్రిల్ 8 (వార్త):ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ కౌన్సిలర్ కేశవపట్నం నరసింహా మూర్తి(75) కన్నుమూశారు. ఆయన గతకొంత కాలం గా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన గతంలో వార్డు సభ్యునిగా కౌన్సిలర్ గా పనిచేశారు.కాంగ్రెస్ పార్టీ లో క్రీయాశీలకం గా వ్యవహరించారు.చురుగ్గా పని చేసేవారు. పొగాకు వ్యాపారం తో పాటు రామా లాడ్జీ ని కూడా నడిపారు.ఆయన కు భార్య ముగ్గురు కుమారులు బాబ్జి, రాంజీ ,అంజి ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

## పలాస బార్ అసోషియేషన్ అధ్యక్షులుగా ఫయ్యాజ్ అహ్మద్(గని)



పలాస, ఏప్రిల్ 8 (వార్త) : పలాస బార్ అసోషియేషన్ అధ్యక్షులుగా ఫయ్యాజ్ అహ్మద్(గని) రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పలాస బార్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని అధికారికంగా వెల్లడించారు. అధ్యక్షులుగా గతంలో పని చేసిన ఫయ్యాజ్ అహ్మద్(గని)ని అసోసియేషన్ సభ్యులు తిరిగి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బి.కామేశ్వరరావు పట్నాయక్, కార్యదర్శిగా ఎన్.వి.రమణ, సహాయ కార్యదర్శిగా తెప్ప శ్యామసుందర్, కోశాధికారిగా కొర్ల దేవి మహాలక్ష్మి, లైబ్రేరియఎన్ గా కోత రజనీకుమార్ ను ఎన్నుకున్నట్లు అధ్యక్షులు ఫయ్యాజ్ అహ్మద్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి న్యాయవాదులందరూ శుభాకాంక్షలు తెలిపారు.

## విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



పలాస, ఏప్రిల్ 8 (వార్త): ప్రతి ఉద్యోగి తన విధి నిర్వహణలో ప్రజలకు, తోటి ఉద్యోగులు, ఉన్నతాధికారులకు అందించిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని పలువురు న్యాయవాదులు అన్నారు. పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సూపరింటెండెంట్ గా పనిచేసిన కె.క్రిష్ణారావు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా కోర్టు ఆవరణలో మంగళవారం రాత్రి న్యాయవాదులు, పోలీసులు, తోటి సిబ్బంది అయనకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోషియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్(గని) సీనియర్ న్యాయవాదులు పి.రాజారత్నం నాయుడు, బికెఆర్. పట్నాయక్, కొమర దేవరాజులు మాట్లాడుతూ సూపరింటెండెంట్ క్రిష్ణారావు పలాస కోర్టులో మూడు సార్లు విధులు నిర్వహించారని, ఆయన ఎంతో మృదుస్వభావం కలిగిన వ్యక్తి అని అన్నారు. ప్రతీ ఒక్కరికి తన వంతు సహకారం అందిస్తూ తన ఉద్యోగ కాలంలో ఎటువంటి మచ్చపడని వ్యక్తి అని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం సంతోషంగా, ఆరోగ్యంగా జీవించాలని అశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిపి రమేష్, న్యాయవాదులు టి.మురళి, పిఎల్.నారాయణ, జిఎంఎన్ అనీల్ రాజ్, జి.ప్రభాకర్, ఎ.రామక్రిష్ణ, శ్యామ్, ఎస్.వెంకటరమణ, బలివాడ రవి, శ్రీనివాస్, వాకాడ రవి, హెచ్. రాణి, విఘేషం, చిట్టిబాబు, దివ్య, మహాలక్ష్మి, కాశీబుగ్గ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, కోర్టు సిబ్బంది, కోర్టు గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ గౌతమి సేవలు ఆదర్శం



ఇచ్ఛాపురం ఏప్రిల్ 8 (వార్త): ఇచ్ఛాపురం ఆసుపత్రిలో గత రెండు సంవత్సరాల నుండి నిర్విరామంగా సమీప ప్రాంతంలో ఉన్న ప్రజలకు అనేక వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలను పొందిన డాక్టర్ గౌతమి సేవలు ఆదర్శమని హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ దేవేందర్ రెడ్డి అన్నారు.వైద్య బృందం సేవలను గుర్తిస్తూ గత అనుభవాలను నెమరు వేసుకుంటూ వీడ్కోలు సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానం చేశారు.డాక్టర్ గా ఉన్నత చదువులు అభ్యసించేందుకు విశాఖపట్నం కే జి హెచ్ నకు పీజీ విద్య కోసం వెళ్తున్నారు. ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించి రోగులు సేవలను అందించి మునుముందు అనేక విధాలుగా చేరువలో సేవలు అందించాలని ఇంకా ఉన్నతమైన పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, డాక్టర్ శ్వేత, డాక్టర్ నీలిమ హెడ్ నర్స్ ,నర్సింగ్ స్టాఫ్ నర్సులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

జలుమూరు, ఏప్రిల్ 8 (వార్త): జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ జి. సుజాత, డాక్టర్ సిహెచ్. అహల్య మాట్లాడుతూ "విజ్ఞానానికి అండగా నిలుద్దాం -- ఆరోగ్యం కోసం కలిసి పనిచేద్దాం" అనే నినాదంతో ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం కల్పించారు. ర్యాలీలో పాల్గొన్న వారు "ఆరోగ్యమే మహాభాగ్యం", "పోషకాహారం -- ఆరోగ్య జీవనం", "పరిశుభ్రత -- వ్యాధి నివారణ", "ఆరోగ్యానికి మించిన సంపద లేదు", "ఆరోగ్యంగా ఉండండి -- ఆనందంగా జీవించండి", "ఇంటి వంట -- ఆరోగ్యానికి మంచిది" వంటి సందేశాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ బి. శివకుమార్, సిహెచ్‌వైఎస్ పద్మావతి, పీహెచ్ఎన్ పద్మావతమ్మ, హెల్త్ సూపర్వైజర్ చిన్నరాజులు, హెల్త్ అసిస్టెంట్ చిన్నారావు, ఆశా వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# తూతూ మంత్రంగా ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ

◆ గంట కాలం వ్యవధిలోనే సమావేశం పూర్తి చేసిన అధికారులు ◆ మళ్ళీ సోషల్ ఆడిట్ నిర్వహించాలంటున్న వేతనదారులు





హిరమండలం,ఏప్రిల్ 8 (వార్త): మండల వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో భాగంగా సోషల్ ఆడిట్ సిబ్బంది వారం రోజులు పాటు నిర్వహించిన తనిఖీలు తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారని పలువురు ఉపాధి హామీ వేతనదారులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఉపాధి హామీ పథకం పనుల్లో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వేతనదారులు ఆరోపిస్తున్నారు. బుధవారం మండల పరిషత్ ఆవరణలో 2024-25 ఆర్థిక సంవత్సరానకు సంబంధించిన ఉపాధిపనులుపై డీఆర్పీలు వారం రోజుల క్రితం నుంచి గ్రామాలలో నామ మాత్రంగా గ్రామసభలు నిర్వహించి రికార్డు నమోదు చేసుకున్నారు. అయితే సంబంధిత అధికారులు, డీఆర్పీలు కుమ్మక్కై గ్రామాలలో తనిఖీలు సక్రమంగా నిర్వహించలేదనే వాదనలు పలువుర నోట వినిపిస్తున్నాయి... డీఆర్పీలు రికార్డులు తారుమారుగా ఉన్నట్లు తెలుస్తోంది... గతంలో ప్రతీ ఏడాది నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమం ఉదయం 10గం॥ల నుంచి మధ్యాహ్నం 3గం॥ల వరకు నిర్వహించేవారు... సుమారు 4గంటల సమయం వెచ్చించి సామాజిక తనిఖీ కార్యక్రమం జరిగేది ప్రస్తుతం నిర్వహించిన సామాజిక తనిఖీ కార్యక్రమం మధ్యాహ్నం 2.30గం॥లకు ప్రారంభించి 3.30గంటలలో నామమాత్రంగా చదివి ముగించేశారు.... ఇప్పటికైన జిల్లా కలెక్టరు కలుగజేసుకొని హిరమండలం మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై మళ్లీ సోషల్ ఆడిట్ నిర్వహించి అవకతవకలని అరికట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పీడి లవరాజు, ఏపిడి రాధ, శ్రీనివాసరెడ్డి, ఎస్ అర్ పి డి.రాజేంద్ర, ఏపీవో శ్రీనివాసరావు, సెక్రటరీలు,ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్, వార్డు సభ్యులకు అభినందించి సత్కారం



జి.సిగడాం, ఏప్రిల్ 08, (వార్త ): జి.సిగడాం మండలం పెంట గ్రామానికి చెందిన సర్పంచ్ పున్నాన సోనియా, గ్రామ వార్డు సభ్యులను లను గ్రామ వైస్ ఆర్ సీపీ సీనియర్ నాయకులు పున్నాన అక్కలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు అభినందన సన్మాన సత్కారం ను గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించారు. సర్పంచ్ కాలపరిమితి ముగిసిన సందర్బంగా అభినందన సత్కారం నిర్వహించారు. సోనియా మాట్లాడుతూ సర్పంచుగా నన్ను గెలిపించి ఐదేళ్లుగా మన గ్రామ అభివృద్ధిలో నాకు సహకరించిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు, అభివందనము తెలిపారు.ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఐదు ఏళ్లుగా ప్రజా సేవాలో నిలిచి గ్రామ అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్, వార్డు సభ్యులకు దుస్సాలు, పూల మాలతో గ్రామస్తులు, పెద్దలు, నాయకులు సచివాలయ సిబ్బంది అందరూ కలిసి సత్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ గా అధికారానికి కాదు, అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచారని. గ్రామాల్లో చేసిన అభివృద్ధి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని, గ్రామాలను ఎంతో గొప్పగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం నుండి ఇప్పటి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో రోడ్డు , భనవాలు, త్రాగు నీటి సమస్యలు, తదితర అభివృద్ది పనులను శరవేగంగా చేశామన్నారు. ప్రజా సమస్యల్లో ఎప్పుడూ అందరిని కలుపుకొని సక్రమంగా విధులు నిర్వహించిన సచివాలయ సిబ్బంది పని తీరు మరివలేనిదని విధి వినాలు బేష్ అని కొనియాడారు. ఇంకా రానన్నా రోజుల్లో సచివాలయ సేవలు ప్రజలకు మరింత మేరుగు పడేలా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పున్నాన పాపి నాయుడు, మీసాల శ్రీను, మక్క శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి దుర్గారావు, విర్వో భూపతి నర్సింగరావు, గ్రామ పాఠశాల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సచివాలయ ,ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల ప్రారంభం

### సమయపాలన పాటించాలని సూచన

సారవకోట, ఏప్రిల్ 8 (వార్త): సారవకోట మండలం తొగిరి గ్రామపంచాయతీలో 2026--2027 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ పనులను మండల తెలుగు యువత అధ్యక్షులు పిళ్లా నందకిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పనులకు హాజరవుతున్న వారు సమయపాలన పాటిస్తూ క్రమం తప్పకుండా పనిచేసి సరైన వేతనం పొందాలని తెలిపారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని, అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని విన్నవించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎండ వేడి నుంచి రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే తాను సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సహాయకురాలు పాల పాపమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్మీ సుబేదార్ భూషణరావుకు సత్కారం



నరసన్నపేట, ఏప్రిల్ 8 (వార్త): ఆర్మీలో సుబేదార్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన తోలాపి భూషణరావును కరగాంలో స్థానికులు ఘనంగా సత్కరించారు. సోమవారం రాత్రి గ్రామానికి చేరుకున్న భూషణరావుకు గ్రామస్థులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆయన సేవలను కొనియాడుతూ గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులు మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధం, ఆపరేషన్ సింధూర్‌లో భూషణరావు పాల్గొన్నారని తెలిపారు. సుమారు 30 ఏళ్లపాటు ఆర్మీలో సేవలందించి దేశానికి గొప్ప సేవ చేసిన ఆయన తమ గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## హెల్మెట్ ధరించడం తప్పనిసరి..

### జలుమూరులో ఎస్ఐ అవగాహన కార్యక్రమం

జలుమూరు, ఏప్రిల్ 8 (వార్త): రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణనష్టం జరుగుతున్నదని ఎస్సై బి. అశోక్ బాబు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి జలుమూరు మండల కేంద్రంలో "సంకల్పం" కార్యక్రమంలో భాగంగా స్థానికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.



## ఎమ్మెల్యేపై ఆరోపణలు అవాస్తవం..

### మీడియా సమావేశంలో ధ్వజమెత్తిన రోనంకి కృష్ణంనాయుడు




నరసన్నపేట, ఏప్రిల్ 8 (వార్త): నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తిపై ఇటీవల వచ్చిన అవినీతి ఆరోపణలను రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రొనంకి కృష్ణంనాయుడు ఖండించారు. బుధవారం నరసన్నపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక కొందరు తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని విమర్శించారు. కొన్ని మీడియా సంస్థల్లో వచ్చిన కథనాలు పూర్తిగా అవాస్తవమని పేర్కొంటూ, ప్రజలు అలాంటి ప్రచారాలను నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరైంది కాదని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుక ఉచితంగా అందించడం, ఉపాధి హామీ పథకం కింద మహిళల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడం వంటి కార్యక్రమాలను గుర్తుచేశారు. 45 సంవత్సరాల రాజకీయ అనుభవం కలిగిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడని, ఆయనపై తప్పుడు ప్రచారాలు చేయడం ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు. ఇకపై ఇటువంటి తప్పుడు ప్రచారాలు కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పొందర కురకుల చైర్మన్ దామోదర్ నర్సింహాలు, డైరెక్టర్ జామి వెంకటరావు, డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మండల అధ్యక్షులు అదపా చంద్రశేఖర్, పాక్స్ చైర్మన్ బైరి భాస్కర్ రావు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేదల సేవలో డాక్టర్ కోదండరాం



ఇచ్ఛాపురం ఏప్రిల్ 8 (వార్త): ప్రజాసేవకు ప్రతీకగా నిలుస్తున్న వైద్యరంగం ఒకప్పుడు "వైద్య నారాయణ హరి" అన్న గౌరవానికి ప్రతిరూపంగా ఉండేది. అయితే నేటి వాణిజ్య వాతావరణంలో కొంతమంది వైద్యులు ఈ పవిత్ర వృత్తివిలువను దిగజార్చుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రిలో క్యాజువాలిటీకి అడుగుపెట్టిన వెంటనే రోగి పరిస్థితిని పరిశీలించకుండానే వేల రూపాయల మందుల జాబితా రాయడం, చిన్న వ్యాధులకే ఖరీదైన పరీక్షలు తప్పనిసరి చేయడం, వంద రూపాయలు విలువ చేసే మందుల బదులుగా అధిక ధరల మెడిసిన్‌ను కొనిపించడంలాంటి అనేక సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.లండన్‌లో చదివానని, ఎఫ్ ఆర్ సి ఎస్ వైద్యుడిని అని చెప్పుకుంటూ సాధారణ జ్వరం--జలుబుకి సరిపడే డోలో650, సిట్రోజిన్ వంటి మందులను ఇవ్వకుండా రోగికి ఆర్థిక భారమే మిగిల్చే స్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో, వైద్యవృత్తిలో నైతికతను, మానవత్వాన్ని అంకితంగా నిలబెట్టిన ఆదర్శ వ్యక్తి డాక్టర్ఉలాల కోదండరాం అని జాతీయ బి సి సంఘం నేతలు అన్నారు. ఇచ్ఛాపురానికి చెందిన యాదవ కుల బీసీ వర్గ నాయకుడైన ఆయన, ఉన్నత స్థాయిలో వైద్య విద్యను అభ్యసించి విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో సహాయ ప్రొఫెసర్‌గా సేవలందించారని, ప్రభుత్వ వైద్య రంగంలో మంచి భవిష్యత్తు ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రజలకు అందుబాటు వైద్యం అందించాలని సంకల్పించిన డాక్టర్ కోదండరాం, తన ప్రతిష్టాత్మక ఉద్యోగానికి స్వస్తి పలికారని, తన స్వగ్రామమైన ఇచ్ఛాపురంలో సర్వ సదుపాయాలతో 30 పడకల ఆసుపత్రిని ప్రారంభించి, పేదలకు అతి తక్కువ ఫీజులతో, ఆప్యాయతతో, మానవతా ధోరణితో వైద్యసేవలను అందిస్తున్నారని, సేవే పరమధర్మమన్న భావంతో రోజుకు వందలాది మంది బాధితులకు చికిత్స చేయడం, అత్యవసర సందర్భాల్లో ఆర్థిక ఇబ్బందులున్న రోగులను ఉచితంగా చూసుకోవడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోందని కొనియాడారు. డాక్టర్ కోదండరాం చేసిన ప్రజాసేవా కార్యక్రమాలను గుర్తిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ సంఘసేవకురాలు డాక్టర్ సిపాన గుణవతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.జి. ప్రసాద్, జిల్లా సలహాదారుడు ఎల్. గోవిందరాజులు, ఇచ్ఛాపురం మండల బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ సాలిన ఢిల్లీ రావు, మహిళా కన్వీనర్ సాలిన పద్మ బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ .."వైద్యరంగం వాణిజ్యం వైపు పరుగులు తీస్తున్న ఈ యుగంలో, పేదలు, వెనుకబడిన వర్గాల కోసం తన ప్రతిష్టాత్మక వృత్తిని వదిలి గ్రామీణ ప్రాంతంలో సేవ చేయడం డాక్టర్ కోదండరాం మహోన్నతతను తెలియజేస్తుందని. ఇటువంటి వైద్యులు సమాజానికి దిక్సూచికలు. బీసీ వర్గానికి చెందిన ఓ వైద్యుడు ఇచ్ఛాపురం వంటి ప్రాంతంలో మానవతా వైద్య సేవలు అందించడం గర్వించదగ్గ విషయం" అని అభిప్రాయపడ్డారు. తనను ఘనంగా సన్మానించినందుకు డాక్టర్ కోదండరాం బీసీ సంక్షేమ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, "ప్రజల ఆరోగ్యం కోసం నిస్వార్థంగా పనిచేయడం నా బాధ్యత, నా ధ్యేయం. ఇచ్ఛాపురం ప్రజలు నాకు చూపుతున్న ప్రేమే నాకు పెద్ద పురస్కారం" అని పేర్కొన్నారు. అత్యాధునిక సౌకర్యాల తో కూడిన సేవలను గ్రామ స్థాయిలో అందించడం ద్వారా డాక్టర్ కోదండరాం వైద్యరంగానికి కొత్త దిశను చూపిస్తున్నారని స్థానికులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# అస్తవ్యస్తంగా జలజీవన్ మిషన్ పనులు

## గ్రామాల్లో ఎక్కడికక్కడే పైపు కట్టలు

సారవకోట, ఏప్రిల్ 8 (వార్త): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు సారవకోట మండలంలో అస్తవ్యస్తంగా మారాయి. పలు గ్రామాల్లో ఎక్కడికక్కడే పైపు కట్టలు కనిపిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇంటింటికి తాగునీటి కనెక్షన్లు అందించేందుకు తీసుకొచ్చిన పైపు లైన్లను గ్రామాల్లో వేసినప్పటికీ, పనులు సక్రమంగా జరగకపోవడంతో అవి రోడ్లపై అలాగే పడివున్నాయి. సారవకోట, బద్రి, సింగంవలస తదితర గ్రామాల్లో ఈ పైపులు రోడ్లపై ఉండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు నిలిచిపోవడంతో తాగునీటి సౌకర్యం కూడా పూర్తిస్థాయిలో అందడం లేదు. ప్రజలు ఇంకా సమస్యలు



ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులను వేగవంతం చేసి, పైపులను సక్రమంగా ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు గృహనిర్బంధం

## అప్పలరాజును అడ్డుకున్న పోలీసులు

పలాస, ఏప్రిల్ 8 (వార్త): శ్రీకాకుళం బయలుదేరి వెళుతుండగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు అడ్డుకొని బుధవారం గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ ఏబీఎన్ మహిళలపై అనుచిత, జుగుప్సాకర వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఇప్పుడు తీవ్ర ప్రతిఘటన, ప్రజా ఆగ్రహం చూపిస్తున్నారని హెచ్చరించారు. మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు పెట్టడం "విమర్శ" కాదని, స్పష్టమైన అవమానం అని వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తీవ్రంగా ఖండించారని తెలిపారు. మీడియా వేదిక ద్వారా మహిళలపై అత్యంత అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి, మహిళా గౌరవానికి వ్యతిరేకమని, రాధాకృష్ణ వ్యాఖ్యలు శిక్షాత్మక చర్యలు, క్షమాపణ లేకుండా మాయమైతే



భవిష్యత్తులో ఇలాంటి హింసాత్మక ఆలోచనలు ఇంకా పెరుగుతాయ అనే మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళలను ఉద్దేశించి ఏబీఎన్ రాధాకృష్ణ మాట్లాడిన మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా శ్రీకాకుళం బయలుదేరుతుండగా కార్యాలయం వద్ద నిరసన తెలపడానికి బయలుదేరిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుని ఇంటి వద్దే ఆపివేసి హౌస్ అరెస్ట్ చేసిన కాశీబుగ్గ పోలీసులు. దీంతో పోలీసులు వర్గానికి వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు కూడా ప్రజలకు లేదా??, ఆంధ్రదేశ్ లో, ప్రజల హక్కులను కలరాస్తున్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో నామరూప లేకుండా పోతుందని ఉక్రోషంగా చెప్పారు. ఈ కార్యక్ర మంలో వైసిపి నాయకులు పైల చిట్టి, ఉంగ సాయి కృష్ణ, దువ్వాడ రవి, బమ్మడి దుర్యోధన, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆఫ్షోర్ ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తాం!

### జిల్లా గ్రంధాలయ చైర్మన్ పీరికట్ల విఠల్



పలాస, ఏప్రిల్ 8 (వార్త): ఆఫ్షోర్ రిజర్వాయర్ ద్వారా మూడు నియోజకవర్గాల్లోని ఐదు మండలాలకు చెందిన 26,000 ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి త్రాగునీరు కూడా సరఫరా అవుతుందని, ఈ ప్రాజెక్టును 2009 ఎన్నికల కంటే ముందే అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కేవలం ?120 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేసి వదిలేశారని జిల్లా గ్రంధాలయం చైర్మన్ పీరికట్ల విఠల్ తెలిపారు. పలాస టిడిపి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014లో గౌతు శివాజీ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత, ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలనే పట్టుదలతో అప్పటి ప్రభుత్వంపై గెడ్డం దీక్ష చేపట్టి ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చారని, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఒప్పించి ?465 కోట్ల నిధులను మంజూరు చేయించారని గుర్తు చేశారు . ఇందులో సుమారు ?290 కోట్లు నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసమే కేటాయించారని, దురదృష్టం 2019లో వచ్చిన ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదని, కనీసం నిధులు కూడా కేటాయించలేదని, ప్రగల్భాలకు తప్ప ఆచరణ సన్యుడిగా అప్పలరాజు మిగిలిపోయాడని విఠల్ పేర్కొన్నారు. అనంతరం 2024 లో అధికారం చేపట్టిన ఎమ్మెల్యే గౌతు శిరీష, మంత్రివర్యులు అచ్చెన్నాయుడు సహకారంతో మళ్ళీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అదనంగా ?130 కోట్లను మంజూరు చేయించారని పేర్కొన్నారు. పనుల పురోగతి: ప్రస్తుతం పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని, వచ్చే ఏడాది కల్లా నీరు అందించాలనే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. పలాస-కాశీబుగ్గ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన ఈ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే శిరీష పూర్తి చేయబోతున్నారని, ప్రాజెక్టు పనులు వైసిపి నాయకులు పరిశీలించ వచ్చని ఆయన వివరించారు.

## పెద్ద శ్రీరాంపురం మొబైల్ నెట్వర్క్ సమస్యకు పరిష్కారం



కంచిలి ఏప్రిల్ 8 (వార్త ): ఎమ్మెల్యే బెందాళం అశోక్ , కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదేశాలతో వివిధ నెట్వర్కు లకు సంబంధించిన అధికారులు బుధవారం పెద్ద శ్రీరాంపురం, చిన్న శ్రీరాం పురం, సమళ్ళ పుట్టుగ, పద్రి పుట్టుగ, పద్రి పుట్టుక కాలనీలో పర్యటించారు. ప్రతి ప్రాంతంలో పది చొప్పున మొత్తం 40 స్థానాల్లో , ఇళ్ల లోపల కూడా సిగ్నల్ నాణ్యతను పరీక్షించారు. ప్రజల అభిప్రాయాలు సేకరించారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు.

## ఉదయం పంట నష్టం పరిశీలన..

## సాయంత్రం కలెక్టర్‌కు వినతి పత్రం

### బాధిత రైతాంగం కోసం శ్యాం ప్రసాద్ రెడ్డి కృషి



సోంపేట, ఏప్రిల్ 8 (వార్త ) మంగళవారం సాయంత్రం భారీ వర్షానికి నష్టపోయిన వందలాదిమంది రైతుల టమాటా తోటలను బుధవారం ఉదయానికల్లా పరిశీలించి సాయంత్రానికి శ్రీకాకుళం చేరుకొని జిల్లా కలెక్టర్ పేరున రైతులను ఆదుకోమంటూ వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్ మాన్ అహ్మద్ ఖాన్ కు ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ కన్వీనర్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి అందజేశారు. 24 గంటలు గడవక ముందే జిల్లా అధికార యంత్రాంగానికి సమాచారాన్ని పూర్తిస్థాయిలో చేరవేసి రైతుల పరిస్థితులను వివరించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి అకాల వర్షాలతో అనూహ్యమైన నష్టాలను చవిచూసిన జింకీభద్ర బెంకిలి , పలాసపురం రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. వ్యవసాయ పనిముట్లను సబ్సిడీ ధరలపై అందజేయాలని కోరారు. శ్యాం ప్రసాద్ రెడ్డి తో పాటు వైసీపీ నాయకులు నర్తు నరేంద్ర యాదవ్, తడక జోగారావు, చల్ల దేవరాజు, సాలిన గాంధీ కూడా ఉన్నారు.

## జీవో 60ని ఉపసంహరించుకోవాలి



జి.సిగడాం, ఏప్రిల్ 08(వార్త): ప్రభుత్వం తక్షణమే సవరించిన జీవో 60ని ఉపసంహరించుకోవాలని, పాత పేస్కేల్‌నే పునరుద్ధరించాలంటూ బుధవారం పంచాయితీ కార్యదర్శులు ఎంపీడీఓ జి.రామకృష్ణారావుకు వినత పత్రాన్ని అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల వేతనాల తగ్గింపు సరికాదన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పంచాయితీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. సుమారు రూ. 3,000 పైగా వేతనంలో కోత విధించడం తగదన్నారు. పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడు తులసీ ప్రసాద్ సాహు, వడగ గౌరీ శంకర్, రాజారమేష్, వెంకట్నాయుడు, ఎదూరి హరిబాబు, సుందరమ్మ, సురేష్,దుర్గారావు, రంజిత్ కుమార్, జాన్సీ, చైతన్య, ధనలక్ష్మీ, లావణ్య, హిమబిందు,భారతీ తదితర పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

### పలాస ఆర్డీవో అప్పలరాజు

పలాస, ఏప్రిల్ 8 (వార్త): లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని పలాస ఆర్డీవో ఆర్ అప్పలరాజు వెల్లడించారు వెల్లడించారు. పలాస ఆర్డీవో కార్యాలయంలో సబ్ డిస్టిక్ మల్టీ లెవెల్ అప్రూవియట్ అథారిటీ, అడ్వైజరీ కమిటీ మెంబర్లు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఆర్. అప్పలరాజు మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయుట చట్టరీత్యా నేరమని, ప్రతి స్కానింగ్ సెంటర్ కు వచ్చే గర్భిణీ స్త్రీల పేర్లు ప్రభుత్వానికి తెలియపరచాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ కు వచ్చిన ప్రభుత్వానికి వివరాలు తెలియ పరచుకుంటే ప్రభుత్వానికి తెలియపరచని స్కానింగ్ సెంటర్ లపై తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని కోరారు. వాటిపై ప్రత్యేకమైన నిఘా వ్యవస్థ ఉందని తెలి యజేశారు. డిప్యూటీ డిఎం ఎండ్ హెచ్ వో మేరీ క్యాథరిన్, పలాస సూపర్డెంట్, పీడి యాట్రిషన్ పాపినాయుడు, గైనకాలజిస్ట్ నాగ సుశీల, పలాస ఏపీ ఎన్జీవోస్, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు గోపాల్ ,ఐసిడిఎస్ సిపివో కే పార్వతి, డిప్యూటీ హెచ్ఈఓ ఎస్ విజయలక్ష్మి పి మోహిని, రత్నకుమారి పాల్గొన్నారు.




# మారుతీ నగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రం

## తొలగించని పలకలతో ఇబ్బందులు

నరసన్నపేట, ఏప్రిల్ 8 (వార్త): నరసన్నపేటలోని మారుతీ నగర్ జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మురుగు కాలువలపై కొత్తగా సిమెంట్ పలకలు వేసి మరమ్మతులు చేపట్టగా, పాత శిథిలమైన పలకలను రోడ్డుపైనే వదిలేయడంతో సమస్య మరింత పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ పలకలు రోడ్డుమధ్యలో ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా రద్దీ సమయంలో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ మార్గం ద్వారా పలు గ్రామాలకు రాకపోకలు సాగుతున్నందున ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణదారులు కూడా వ్యాపారాలపై ప్రభావం పడుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న శిథిల పలకలను తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



# శ్రీకాకుళం

## మూలకు చేరిన రైతు శిక్షణ కేంద్రం..

### ఉపయోగం లేక రైతుల ఆవేదన



నరసన్నపేట, ఏప్రిల్ 8 (వార్త): రైతులకు వ్యవసాయంలో పలు సూచనలు అందించేందుకు నిర్మించిన రైతు శిక్షణ కేంద్రం నరసన్నపేట మండలం దేశవానిపేటలో మూలకు చేరింది. దాదాపు 10 సంవత్సరాల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 60 లక్షల వ్యయంతో ఈ శిక్షణా కేంద్రాన్ని నిర్మించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం వంటి విషయాల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. అయితే నిర్మాణం పూర్తయిన తర్వాత కొద్దిరోజులు మాత్రమే కేంద్రాన్ని నిర్వహించి, తరువాత పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ప్రస్తుతం ఇది ఉపయోగం లేకుండా నిలిచిపోయింది. భవనం ఖాళీగా ఉండటంతో దాని నిర్వహణ కూడా లేకుండా పోయింది. ఈ పరిస్థితిపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే ఇలాంటి కేంద్రాన్ని నిర్లక్ష్యం చేయడం తగదని అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రైతు శిక్షణ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించి, రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## శిథిలావస్థలో పశు వైద్య కేంద్రం భవనం..




### ప్రమాదకరంగా మారిన పరిస్థితి

సారవకోట, ఏప్రిల్ 8 (వార్త): సారవకోట మండలం చీడిపూడిలోని ప్రభుత్వ పశు వైద్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనానికి ఎటువంటి మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో పైకప్పు, గోడలు ఎక్కడికక్కడ బీటలు వారాయి. దీంతో భవనం లోపలికి వెళ్లడం కూడా ప్రమాదకరంగా మారిందని స్థానికులు తెలిపారు. భవనం పరిసరాల్లో పిచ్చి మొక్కలు విస్తరించి ఉండటం వల్ల అశుభ్ర వాతావరణం నెలకొంది. పశువైద్య సేవలు అందించాల్సిన ఈ కేంద్రం ప్రస్తుతం ఉపయోగానికి పనికిరాని పరిస్థితికి చేరింది. ఈ పరిస్థితిపై పశుపాలకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు అవసరమైన వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని మరమ్మతులు చేసి పశు వైద్య సేవలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

## మొబైల్స్‌కు దూరంగా ఉండాలి..

## విద్యార్థులకు సూచన

సారవకోట, ఏప్రిల్ 8 (వార్త): విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ చిరంజీవి సూచించారు. బుధవారం సారవకోటలోని ఒక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ల వినియోగం విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని ఆయన పేర్కొన్నారు. ఎక్కువ సమయం మొబైల్ వినియోగించడం వల్ల చదువుపై దృష్టి తగ్గిపోతుందని, మానసికంగా కూడా ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. విద్యార్థుల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత ముఖ్యమని, పిల్లలపై పర్యవేక్షణ పెంచి సమయపాలన అలవాటు చేయాలని సూచించారు. మొబైల్ వినియోగాన్ని నియంత్రించి, చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు మార్గనిర్దేశం చేయాలని ఆయన తెలిపారు.

## టెన్త్ విద్యార్థులకు ఎంఈఓ సూచనలు

### ముందస్తు సిద్ధత అవసరం



సారవకోట, ఏప్రిల్ 8 (వార్త): అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎంఈఓ-1 మద్దు వెంకటరమణ పలు సూచనలు చేశారు. మంగళవారం పాఠశాలను సందర్శించిన ఆయన ముందుగా విద్యార్థులతో సమావేశమై పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే మార్గాలను వివరించారు. పరీక్షల సమయం వచ్చినప్పుడే చదవడం కాకుండా ముందుగానే పాఠ్యాంశాలను తరచుగా అభ్యసించాలని సూచించారు. ఇలా నిరంతరంగా చదవడం ద్వారా పరీక్షలు సులభంగా రాయగలరని పేర్కొన్నారు. సమయపాలన పాటిస్తూ పునరావృతం (రీవిజన్) చేయడం, ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై విజయాన్ని సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

## పంట నష్టాన్ని నమోదు చేయించండి

### రైతులకు ఢిల్లీ రావు విజ్ఞప్తి



సోంపేట ఏప్రిల్ 8 (వార్త ): సోంపేట మండలంలో మంగళవారం మధ్యాహ్నం విపరీతంగా కురిసిన వడగండ్ల వాన భారీ ఈదురుగాలులకు టమాట, కట్టు జనుము, చోడి, పెసర, మినుము పంటలు భారీగా నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రైతన్నలు వ్యవసాయ శాఖ లేదా ఉద్యాన శాఖ అధికారుల వద్ద తమ తమ పంట నష్టాలను తప్పకుండా నమోదు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బీన ఢిల్లీ రావు కోరారు. 33 శాతం కనీసంగా పంట నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా నష్టపరిహారం అందుతుందని ఢిల్లీ రావు తెలిపారు. ఈ విషయంలో రైతులు నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఉన్నతాధికారులకు పంట నష్టం నివేదిక



**సోంపేట ఏప్రిల్ 8(వార్త):** జింక భద్ర, బెంకిలి, పలాసపురం గ్రామాలలో మంగళవారం కురిసిన వడగండ్ల వాన భారీ ఈదురుగాలులకు టమాట పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితి చూసి రైతులు లబోదిబోమంటున్నారు. ఈ పరిస్థితుల్లో బుధవారం ఉదయం ఉద్యాన శాఖ అధికారిని మాధవి ఆయా గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. బెంకిలి గ్రామ పరిధిలో సుమారు 200 ఎకరాలు, జింకీభద్ర గ్రామ పరిధిలో సుమారు 126 ఎకరాలు, పలాసపురం గ్రామ పరిధిలో సుమారు 50 ఎకరాలు టమాట పంటకు నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. సుమారు 450 మంది రైతులు బాధితులుగా గుర్తించారు. ఈ మేరకు పొలాల్లో తక్షణం తీసుకోవాల్సిన చర్యలను గూర్చి మాధవి లత రైతులకు వివరించారు. జిల్లా అధికారులకు ఇందుకు సంబంధించిన పంట నష్టం నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు.

# కొలువుల జాతర




* ఈనెల 9,10 తేదీల్లో జాబ్‌మేళా
* ఇంటర్వ్యూ నిర్వహించనున్న పలు కంపెనీలు
* జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మేళా

**శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త):** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు పి. కిరణ్ కుమార్, జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధా తెలిపారు. ఈనెల 9న ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎచ్చెర్ల మండలంలోని తహశీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో, శ్రీకాకుళం నగరంలోని బలగలోని డీఎల్‌టీసీలో ఈనెల 10న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. ఈ ఉద్యోగ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని వారు తెలిపారు. KIA Wooyoung DSC Hmaseung (BISAFE) కంపెనీవారు నిర్వహించే అసోసియేట్, టెక్నీషియన్ ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, బీటెక్, ఎం టెక్, విద్యార్హతలు కలిగి ఉండి 18 సంవత్సరములు నుండి 28 సంవత్సరముల లోపు గల నిరుద్యోగ యువతకు బెంగుళూరు, చెన్నైలో పనిచేయవలసి ఉంటుందన్నారు. వీరికి నెలకు 15000 నుండి 17000 వరకు జీతంతో పాటు ఉచిత భోజన వసతి కల్పించడం జరుగుతుంది తెలిపారు. అలాగే Big Basket (KL Technical Service) కంపెనీవారు నిర్వహించే వేర్ హౌస్ అసోసియేట్ ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు అర్హులు. 18 సంవత్సరములు నుండి 30 సంవత్సరముల వయస్సు గల నిరుద్యోగ యువత హైదరాబాద్‌లో పనిచేయవలసి ఉంటుందని, వీరికి నెలకు 19,000 నుండి 23000 జీతం చెల్లిస్తూ సబ్సిడీ భోజన సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. Dazzle Sports Wear Pvt. Ltd. కంపెనీవారు నిర్వహించే సీవింగ్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఐదవతరగతి నుండి పదవ తరగతి విద్యార్హతో పాటు సీవింగ్ ఆపరేటర్ అనుభవం ఉండి 18 సంవత్సరములు నుండి 35 సంవత్సరముల వయస్సు గల నిరుద్యోగ యువతకు నెలకు 16 వేల జీతంతో పాటు ఉచిత భోజన సదుపాయం కల్పించనున్నట్లు వీరు హైదరాబాద్‌లో పనిచేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. Hetero Groupకంపెనీవారు నిర్వహించే కెమిస్ట్ జూనియర్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఐటిఐ ఫిట్టర్స్, ఎలక్ట్రీషియన్స్, ఇంటర్, బీకాం, బిఎస్సి కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ విద్యార్హతలు కలిగి ఉండి 18 సంవత్సరములు నుండి 26 సంవత్సరముల వయస్సు గల నిరుద్యోగ యువతకు హైదరాబాద్ లో పనిచేయవలసి ఉంటుందని వీరికి 2.30లక్షల నుండి 2.80లక్షల వరకు ప్యాకేజీ చెల్లించనున్నట్లు తెలిపారు. Greentech Industries India Pvt. Ltd కంపెనీవారు నిర్వహించే మిషన్ ట్రైనీ ఆపరేటర్ ఉద్యోగాలకు పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ డిప్లమా, బీటెక్, (మెకానికల్) విద్యార్హత కలిగి ఉండి 18 సంవత్సరములు నుండి 32. సంవత్సరముల వయస్సు గల నిరుద్యోగ యువతకు నాయుడుపేటలో పనిచేయవలసి ఉంటుందని వీరికి నెలకు 12000 నుండి 14000 వరకు జీతంతో పాటు 500 బోనస్ మరియు ఉచిత భోజన వసతి కల్పించడం జరుగుతుంది తెలిపారు. కొన్ని సంస్థల్లో ఉచిత భోజనం, వసతి, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, నాయుడుపేట తదితర ప్రాంతాల్లో పనిచేయవలసి ఉంటుంది. వివిధ విభాగాల్లో అసోసియేట్, టెక్నీషియన్, వేర్‌హౌస్ అసోసియేట్, సివింగ్ ఆపరేటర్, కెమిస్ట్, మెషిన్ ట్రైనీ ఆపరేటర్ వంటి ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్లు, అవసరమైన ధ్రువ పత్రాలతో హాజరుకావాలని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు పి. కిరణ్ కుమార్ కోరారు. అలాగే అపోలో ఫార్మసీ, ముత్తుట్ మైక్రో ఫిన్ లిమిటెడ్‌లో 80 ఫార్మసీ ట్రైనీ, ఫార్మసిస్ట్ ఖాళీలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. అపోలో ఫార్మసీ వారు నిర్వహించే ఉద్యోగాలకు నెలకు జీతం రూ. 15,000 నుండి రూ. 20,000లతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో పనిచేయవలసి ఉంటుంది. అలాగే ముత్తుట్ మైక్రోఫిన్ లిమిటెడ్ వారు నెలకు రూ. 16,000 నుండి రూ. 23,000 జీతంతో శ్రీకాకుళం పలాస, సోంపేట, పెందుర్తిలలో పనిచేయవలసి ఉంటుందనీ, ఇంటర్మీడియట్ ఆపై విద్యార్హత కలిగిఉండి 18 నుండి 28 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతి యువకులకు 25 రిలేషన్స్ ఆఫీసర్ ఖాళీలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు తదితర పత్రాలతో ఈనెల 10న ఉదయం 10 గంటలకు గవర్నమెంట్ డి. ఎల్. టి .సి. (ఐ. టి .ఐ) బలగ జంక్షన్ శ్రీకాకుళంలో హాజరుకావాలన్నారు. అభ్యర్థులు ముందస్తుగా www.ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధా ఒక ప్రకటనలో కోరారు.



## ఘనంగా ద్వారకా హాస్పిటల్ ప్రారంభం



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 8 (వార్త):** ఇచ్ఛాపురంలో ప్రప్రథమంగా నూతన సాంకేతిక పరికరాలతో గోర్జీ వీధిలో ద్వారకా హాస్పిటల్ ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ.. ద్వారకా ఆసుపత్రిని ప్రారంభించారు. ప్రతి రోగికి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలన్నదే లక్ష్యం అని సి ఎం డి డాక్టర్ ఉళాల శేషు యాదవ్ అన్నారు.24 గంటలు సేవలు ,పిల్లలు, హృద్రోగ, న్యూరో, కాన్సర్, కిడ్నీ, స్కిన్, గైనిక్ వంటి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఎండి ఉళాల భారతి దివ్య, ఎంపిపి బోర పుష్ప ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు వైద్యులు పాల్గొన్నారు.

## 11న జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త):**సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకలను ఈ నెల 11న జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు నగరంలోని పొన్నాడ వంతెన సమీపంలో ఉన్న పూలే పార్కు వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించనున్నట్లు పేర్కొన్నారు.

## శివాజీ రాజాకు ఫిలిం ఫెడరేషన్ సత్కారం



**మందస, ఏప్రిల్ 8 (వార్త):**ప్రముఖ సినీ నటులు శివాజీ రాజాకు ఏపీ తెలుగు ఫిలిం ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్‌ను ఘనంగా సత్కరించారు. శివాజీ రాజా హీరోగా, ప్రతి నాయకుని గా, సుమారు 500 పైచిలుకు సినిమాల్లో నటించారు. కళ్ళు,పెళ్లి సందడి ,చిత్రాలకు ప్రేక్షకుల్లో మంచి స్పందన వచ్చిందని కుమార్ నాయక్ తెలిపారు. డొక్కా కృష్ణారావు స్వీయ రచన దర్శకత్వంలో, పలాస ప్రాంతంలో ఓ చలనచిత్రం షూటింగ్ సందర్భంగా శివాజీ రాజా పలాస వచ్చారు. ఈ సందర్భంగా ఫిలిం ఫెడరేషన్ బృందం కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు కొండల ప్రకాష్, షేక్ రాజా బాబు, మేకప్ ఆర్టిస్ట్ ఈశ్వర్ రావు పాల్గొన్నారు.

## సిక్కోలు అభివృద్ధిపై ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమీక్ష



**శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త):** శ్రీకాకుళం జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కీలక సమీక్షా సమావేశంలో కేంద్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి, బెందాళం అశోక్, గౌతు శిరీష, ఎన్.ఈశ్వరరావులు పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు, ప్రజా సేవల మెరుగుదలపై విస్తృతంగా చర్చించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సీఎం సూచనలు ఇవ్వగా, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని ఎమ్మెల్యేలు తెలిపారు.

## రాధాకృష్ణ.. మహిళలకు క్షమాపణ చెప్పాలి

* వైసీపీ నేతల డిమాండ్ * ఎచ్చెర్ల ఆంధ్రజ్యోతి కార్యాలయం ఎదుట ధర్నా

**శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త):**మహిళలపై అవమానకర వ్యాఖ్యలు చేసిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అధినేత రాధాకృష్ణ తక్షణమే క్షమాపణ చెప్పాలని వైయస్‌ఆర్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల ఆంధ్రజ్యోతి కార్యాలయం ఎదుట వైయస్‌ఆర్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ 'ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమంలో మహిళలను కించపరిచేలా మాట్లాడారన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పుకునే కూటమి నాయకులు ఈ ఘటనపై స్పందించకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, పోలాకి జడ్పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య, శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.




# భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం

* 100 రోజుల ప్రణాళికతో 'జలధార-జలహారతి' అమలు * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


**శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త):**జిల్లాలో భూగర్భ జల మట్టాలను పెంచి, నీటి భద్రతను కల్పించడమే లక్ష్యంగా 'జలధార - జలహారతి' 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి బృందాలు, వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. అన్నమయ్య జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన జలధార కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతి గ్రామంలోనూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన బృందాలు క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రజలను, సాగునీటి సంఘాలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. జూలై నాటికి నిర్దేశించిన పనులన్నీ నూరు శాతం పూర్తి కావాలని, ఇందుకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను ఈ నెల 15 లోపు ముగించాలని స్పష్టం చేశారు. అనంతరం




జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. శివారు భూములకు సాగునీరు అందేలా డ్రెయిన్లు, కాలువలకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా మిగులు జలాలను అవసరమైన చోటికి అనుసంధానం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ఇంకుడు గుంతలు, చెక్ డ్యాంల నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ లవరాజు, ఇరిగేషన్ ఎస్ఈ పొన్నాడ సుధాకర్ రావు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, వంశధార, అటవీ శాఖ అధికారులు, మండల స్థాయి బృందాల సభ్యులు పాల్గొన్నారు.

## అపురూపం.. వాసుదేవుని దివ్యస్వరూపం

**మందస, ఏప్రిల్ 8(వార్త):** శ్రీవాసుదేవ పెరుమాళుని దివ్యమంగళ స్వరూపం భక్తులను భక్తితన్మయత్వానికి తీసుకెళ్లింది. స్వామి జన్మతిథి నక్షత్రమైన మూలా నక్షత్రం బుధవారం కావడంతో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. పసుపు, కుంకుమ, క్షీర, చందన అభిషేకాలు అనంతరం స్వామి నిజరూప దర్శనానికి భక్తులకు అనుమతించారు. మూలానక్షత్రం రోజున భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. అభిషేకాలు, నిజరూపదర్శనం అనంతరం వాసుదేవునికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేక అలంకరణలో వాసుదేవుని తిరుమల-తిరుపతిలోని శ్రీవెంకటేశ్వరస్వామిలా కనిపించడంతో భక్తులు గోవిందా.. వాసుదేవా.. అంటూ భక్తితో స్వామివారిని కొలిచారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.



# ఆదర్శం.. ప్రభావతి అవయవదానం

* ఆర్గాన్స్ డొనేట్‌కు ముందుకు వచ్చిన కుటుంబీకులు * చిన్నబరంపురంలో అంత్యక్రియలు





**మందస, ఏప్రిల్ 8(వార్త):**అవయవదానంపై గ్రామీణ ప్రాంతాల్లో కూడా చైతన్యం కలుగుతోంది. మరణించిన వారి అవయవాలను దానం చేస్తున్నారు. ఒకప్పుడు అవయవదానంపై గ్రామీణ ప్రాంతాల్లో అపోహలు ఉండగా.. నేడు అవి కనుమరుగవుతున్నాయి. అవయవదానంతో మరి కొందరి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. మందస మండలంలోని చిన్నబరంపురం గ్రామానికి చెందిన వడ్డి ప్రభావతి అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ప్రభావతి చికిత్స పొందుతుండగా.. బ్రెయిన్ డెడ్ అయ్యింది. దీంతో ఆమె భర్త వడ్డి భాస్కరరావు, కుమారుడు శంకరరావు, కుటుంబీకులు అవయవదానం చేయడానికి ముందుకు వచ్చారు. ప్రభావతి మరణంతో వారంతా పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ, కొందరికి ప్రాణాలు పోయనున్న అవయవదానం చేయడానికి అంగీకరించారు. దీంతో ప్రభావతి శరీరం నుంచి ఆర్గాన్స్ ఇతర ప్రాంతాలకు తరలించారు. ప్రభావతి కుటుంబీకుల త్యాగాన్ని వైద్యులు అభినందించారు. ఆసుపత్రి నిబంధనల ప్రకారం మృతదేహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. ప్రభావతి మృతదేహం చిన్నబరంపురం చేరుకోగానే.. ప్రతీ ఒక్కరూ కన్నీటి పర్యవంతమయ్యారు. ఆమె మరణిస్తూ.. మరొకరి జీవితంలో వెలుగులు అందజేశారని కొనియాడారు. ప్రభావతి అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. భారమైన హృదయాలతో ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభావతి కుటుంబం చూపిన త్యాగం పలువురు ఆదర్శంగా మారింది.



## నీలమ్మ తల్లి ప్రతిమల ఊరేగింపు

**అరసవల్లి, ఏప్రిల్ 8 (వార్త):** అరసవల్లి ఆసిరిమ్మతల్లి అమ్మవారి పండుగలు సందర్భంగా నీలమ్మ తల్లి కొత్త ప్రతిమలను అరసవల్లిలో ఊరేగించారు. అనంతరం నీలమ్మ తల్లి ప్రతిమలను శాస్త్రోక్తంగా ఆలయంలో ప్రతిష్టించారు. నీలమ్మతల్లికి పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు శ్రీకాకుళం నగర కార్పొరేషన్ క్లస్టర్ ఇంచార్జ్ ఉంగటి రమణ మూర్తి, పాల్గొన్నారు.

# సిద్దిగాం విద్యార్థిని 'శ్రీధరాత్మజ' ప్రతిభ

* గద్య, పద్య పఠనంలో గుర్తింపు
* ఏయూలో ఘనంగా సన్మానం



**మందస, ఏప్రిల్ 8(వార్త):** ఆ చిన్నారి నోట వెంట వెలువడే మంచి మాటలు ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటాయి.. పురాణాల్లోని పద్యాలు, శ్లోకాలు, గద్యాలను శ్రవణానందం కలిగిస్తాయి.. ఆమె ప్రతిభను ఇప్పటికే పలువురు గుర్తిస్తున్నారు. మందస మండలంలోని సిద్దిగాం గ్రామానికి చెందిన బొంగి శ్రీధరాత్మజ ఆరవ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు బొంగి శ్రీధర్, శ్రీలక్ష్మి ప్రత్యేక కృషితో శ్రీధరాత్మజను ప్రయోజకురాలిగా తీర్చిదిద్దుతున్నారు. రామాయణ, భారత, మహాభాగవత తదితర పురాణాలలో ఆమె మంచి ప్రావీణ్యం కల్పిస్తున్నారు. దీంతో విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం కలిగింది. రఘువీర గద్యం కడు రమ్యంగా చెప్పిన శ్రీధరాత్మజకు ప్రతిభ ఆహూతులు మంత్రముగ్ధులయ్యారు. దీంతో ఆమెకు ఏయూ తెలుగుశాఖ అధ్యక్షుడు జర్రా అప్పారావు, విశ్రాంత ఆచార్యుడు, అతిథి ఆచార్యుడు వెలమల సిమ్మన్న చేతుల మీదుగా మెమెంటో, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. శ్రీధరాత్మజ ప్రతిభకు స్థానికులు అభినందనలు తెలిపారు.

### ఒకే వేదికపై తండ్రి, కుమార్తెకు సన్మానం

బొంగి శ్రీధర్ కూడా అవధానంలో అందెవేసిన చేయి. ఇదే శతాబ్ది ఉత్సవాల్లో అవధానం పృచ్ఛకుడుగా తండ్రి శ్రీధర్ కు ఇదే వేదికపై అవకాశం కలిగింది. శ్రీధర్ అవధానానికి సభికులు హర్షధ్వానాలు చేశారు. అద్భుత ప్రతిభకు సభికులు కరతాళ ధ్వనులు చేశారు. ముందుగా కుమార్తె శ్రీధరాత్మజకు సన్మానం జరుగగా.. అనంతరం తండ్రి శ్రీధర్కు అదే వేదికపై సన్మానం జరుగడం విశేషం. సన్మాన గ్రహీతలిద్దరికీ.. ఈ ప్రాంతీయులు అభినందనలు తెలిపారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546